25-03-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - అంతర్ముఖులుగా అయి విచార సాగర మంథనము చేసినట్లయితే సంతోషము మరియు నషా ఉంటుంది, మీరు బాబా సమానమైన టీచర్లుగా అవుతారు"

ప్రశ్న:- ఏ ఆధారముపై ఆంతరిక సంతోషము స్థిరముగా ఉండగలదు?

జవాబు:- ఎప్పుడైతే ఇతరుల కళ్యాణమును కూడా చేసి అందరినీ సంతోషపరుస్తారో అప్పుడే స్థిరమైన సంతోషము ఉండగలదు. దయార్ద్ర హృదయులుగా అయినట్లయితే సంతోషము ఉంటుంది. ఎవరైతే దయార్ద్ర హృదయులుగా అవుతారో వారి బుద్ధిలో - ఓహో, మమ్మల్ని సర్వాత్మల తండ్రి చదివిస్తున్నారు, పావనంగా తయారుచేస్తున్నారు, మేము విశ్వ మహారాజుగా అవుతాము అని ఉంటుంది! ఇటువంటి సంతోషాన్ని వారు దానం చేస్తూ ఉంటారు.

ఓంశాంతి. ఆత్మిక తండ్రి ఆత్మిక పిల్లలను ప్రశ్నిస్తున్నారు - పిల్లలూ, ఈ ఓం శాంతి అని ఎవరు అన్నారు? (శివబాబా). అవును, శివబాబాయే అన్నారు, ఎందుకంటే వారు సర్వాత్మలకూ తండ్రి అని పిల్లలకు తెలుసు. వారు అంటారు, నేను కల్పకల్పమూ ఈ రథములోకే వచ్చి చదివిస్తాను. ఇప్పుడు వీరు చదివించే టీచరు అయినట్లు. టీచర్ వచ్చినప్పుడు గుడ్ మార్నింగ్ అని చెప్తారు. పిల్లలు కూడా గుడ్ మార్నింగ్ అని చెప్తారు. ఆత్మలకు పరమాత్మ గుడ్ మార్నింగ్ చెప్తున్నారని పిల్లలకు తెలుసు. లౌకిక రీతిలో గుడ్ మార్నింగ్ అయితే ఎంతోమంది చెప్తూ ఉంటారు. వీరు అనంతమైన తండ్రి, వీరు వచ్చి చదివిస్తారు. పిల్లలకు మొత్తం వృక్షము మరియు డ్రామా రహస్యాన్ని అర్థం చేయిస్తారు. ఆత్మలందరూ ఎవరైతే ఉన్నారో, వారందరి తండ్రి వచ్చి ఉన్నారని మీకు తెలుసు. అనంతమైన తండ్రి మనల్ని చదివిస్తున్నారు అని, వారు మనకు తండ్రి, టీచర్, గురువు అని - ఈ నిశ్చయము రోజంతా బుద్ధిలో ఉండాలి. వారిని రచయిత అని అంటారు - ఇది కూడా అర్థం చేసుకోవలసి ఉంటుంది. వారు ఆత్మలను రచించరు. వారు అర్థం చేయిస్తారు - నేను బీజరూపుడను, ఈ మనుష్య సృష్టి రూపీ వృక్షము యొక్క జ్ఞానాన్ని మీకు వినిపిస్తాను. బీజము తప్ప ఈ జ్ఞానాన్ని ఇంకెవరు ఇవ్వగలరు? అలాగని వారు ఈ వృక్షాన్ని రచించారు అని అనరు. వారు అంటారు - పిల్లలూ, ఇది అనాది అయినది. లేదంటే ఇది ఎప్పుడు మరియు ఎలా రచించాను అన్న దీని తిథి-తారీఖు అన్నింటినీ తెలియజేస్తాను కదా. కానీ ఇది అనాది రచన. తండ్రిని జ్ఞానసాగరుడు అని అంటారు. జానీజాననహార్ (అన్నీ తెలిసినవారు) అనగా వారికి వృక్షము యొక్క ఆదిమధ్యాంతాల రహస్యము తెలుసు. తండ్రే మనుష్య సృష్టికి బీజరూపుడు, జ్ఞానసాగరుడు. వారిలోనే మొత్తం జ్ఞానమంతా ఉంది, వారే వచ్చి పిల్లలను చదివిస్తారు. శాంతి ఎలా లభించగలదు? అని మనుష్యులు అందరూ అడుగుతూ ఉంటారు. శాంతిని అయితే శాంతి సాగరుడే స్థాపన చేస్తారని మీరు ఇప్పుడు చెప్తారు. వారు శాంతి, సుఖము మరియు జ్ఞానము యొక్క సాగరుడు. ఏ జ్ఞానము? సృష్టి ఆదిమధ్యాంతాల జ్ఞానము. వారైతే శాస్త్రాలను కూడా జ్ఞానముగా భావిస్తారు. అలా శాస్త్రాలను వినిపించేవారైతే ఎంతోమంది ఉన్నారు. ఈ అనంతమైన తండ్రి స్వయమే వచ్చి పరిచయాన్ని ఇస్తారు మరియు సృష్టి ఆదిమధ్యాంతాల జ్ఞానాన్ని కూడా ఇస్తారు. వారు రావడంతోనే శాంతి స్థాపన అవుతుంది అని కూడా భావిస్తారు. అక్కడ ఉండేదే శాంతి, శాంతిధామంలో అందరూ శాంతిలో ఉండేవారని కూడా ఎవరికీ తెలియదు. ఇక్కడ శాంతి ఎలా లభించగలదు అని వారు అంటూ ఉంటారు. ఒకప్పుడు ఇక్కడ శాంతి తప్పకుండా ఉండేది. రామరాజ్యములోని శాంతి కావాలి. రామరాజ్యము ఎప్పుడు ఉండేది అన్నది ఎవరికీ తెలియదు. ఎంతోమంది ఆత్మలు ఉన్నారు అని బాబాకు తెలుసు. నేను వారందరికీ తండ్రిని. ఈ విధంగా ఇంకెవ్వరూ అనలేరు. ఆత్మలందరూ ఎవరైతే ఉన్నారో, వారంతా ఈ సమయంలో ఇక్కడే ఉన్నారు. మొదట శాంతిధామంలో ఉండేవారు, ఆ తర్వాత సుఖధామంలోకి వచ్చారు, ఆ తర్వాత సుఖధామం నుండి దుఃఖధామంలోకి వచ్చారు. సుఖ-దుఃఖాల ఈ ఆట ఎలా రచింపబడి ఉంది అనేది ఎవ్వరికీ తెలియదు. కేవలం నామమాత్రంగా తెలియకుండానే ఇది రాక-పోకల ఆట అని అంటారు. ఇప్పుడు పిల్లలైన మీ బుద్ధిలో ఉంది - వారు ఆత్మలమైన మనందరికీ తండ్రి, వారు మనకు జ్ఞానాన్ని వినిపిస్తున్నారు, వారు వచ్చి స్వర్గ రాజ్య స్థాపనను చేస్తారు, మనల్ని చదివిస్తారు. వారు అంటారు - పిల్లలూ, మీరే దేవతలుగా ఉండేవారు. ఈ విధంగా ఇంకెవ్వరూ అనరు. సర్వాత్మల తండ్రి మిమ్మల్ని చదివిస్తున్నారు. ఇది ఎంతటి పెద్ద అనంతమైన నాటకము, వారు లక్షల సంవత్సరాలు అని అనేస్తారు. మీరు అంటారు - ఇది 5,000 సంవత్సరాల ఆట. ఇప్పుడు పిల్లలైన మీరు తెలుసుకున్నారు - శాంతి రెండు రకాలుగా ఉంటుంది, ఒకటేమో శాంతిధామంలోని శాంతి, ఇంకొకటి సుఖధామంలోని శాంతి. సర్వాత్మల తండ్రి మనల్ని చదివిస్తున్నారు అని పిల్లలైన మీ బుద్ధిలో ఉంది. ఇది ఏ శాస్త్రములోనూ లేదు. వీరు అనంతమైన తండ్రి కదా. అని ధర్మాలవారూ వారిని అల్లా, గాడ్ ఫాదర్, ప్రభూ మొదలైన

పేర్లతో పిలుస్తారు. వారు చెప్పే చదువు కూడా తప్పకుండా అంత ఉన్నతముగా ఉంటుంది. ఈ విషయం రోజంతా మీ లోపల ఉండాలి. తండ్రి అంటారు, నేను మీకు కొత్త విషయాలను వినిపిస్తాను, కొత్త రకంగా చదివిస్తాను, మీరు మళ్ళీ ఇతరులను చదివిస్తారు. భక్తి మార్గములో దేవీలకు కూడా ఎంతో గౌరవం ఉంటుంది. వాస్తవానికి ఈ బ్రహ్మ కూడా పెద్ద తల్లియే. శివుడినైతే కేవలం తండ్రి అనే అంటారు. మాత, పిత అని వీరిని అంటారు. ఈ మాత ద్వారా బాబా మిమ్మల్ని దత్తత తీసుకుంటారు. పిల్లలూ, పిల్లలూ అని అంటూ ఉంటారు.

తండ్రి అంటారు - నేను ప్రతి 5,000 సంవత్సరాల తర్వాత మీకు ఈ జ్ఞానాన్ని వినిపిస్తాను. ఈ చక్రము కూడా మీ బుద్ధిలో ఉంది. మీరు ఒక్కొక్క పదాన్ని కొత్తగా వింటారు. జ్ఞానసాగరుడైన తండ్రి ఇచ్చేది ఆత్మిక జ్ఞానము. ఆత్మిక తండ్రే జ్ఞానసాగరుడు. ఆత్మ 'బాబా' అని అంటుంది. పిల్లలు కూడా అన్ని విషయాలనూ బుద్ధిలో బాగా ధారణ చేస్తారు. అంతర్ముఖులుగా అయి ఎప్పుడైతే ఈ విధంగా విచార సాగర మంథనము చేస్తారో, అప్పుడు ఆ సంతోషము మరియు నషా ఉంటుంది. పెద్ద టీచర్ అయితే ఒక్క శివబాబాయే. వారు మళ్ళీ మిమ్మల్ని కూడా టీచర్ గా తయారుచేస్తారు. అందులోనూ నంబరువారుగా ఉన్నారు. ఈ బిడ్డ చాలా బాగా చదివిస్తున్నారని, అందరూ సంతోషిస్తున్నారని బాబాకు తెలుసు. ఏ బాబా అయితే మిమ్మల్ని ఈ విధంగా తయారుచేసారో, వారి వద్దకు మమ్మల్ని కూడా త్వరగా తీసుకువెళ్ళండి అని అంటారు. నేను ఇతని అనేక జన్మల అంతిమ జన్మలోని అంతిమ సమయంలో ఇతనిలోకి ప్రవేశించి మిమ్మల్ని చదివిస్తాను అని బాబా తెలియజేస్తారు. కల్పకల్పమూ నేను ఎన్ని సార్లు ఈ భారత్ లోకి వచ్చి ఉంటాను. మీరు ఈ కొత్త విషయాలను విని ఆశ్చర్యపోతారు. అనంతమైన తండ్రి మనల్ని చదివిస్తారు. వారికే భక్తి మార్గంలో ఎన్నో పేర్లు ఉన్నాయి, కొందరు పరమాత్మ అని, రామ, ప్రభువు, అల్లా... అని అంటారు. ఒక్క టీచర్ కే ఎన్ని పేర్లు పెట్టారో చూడండి. టీచరుకైతే ఒకటే పేరు ఉంటుంది, ఎక్కడైనా అనేక పేర్లు ఉంటాయా? ఎన్ని భాషలున్నాయి. కావున కొందరు ఖుదా అని, కొందరు గాడ్ అని... ఇలా ఏవేవో పేర్లతో పిలుస్తారు. నేను పిల్లలను చదివించడానికి వచ్చాను అని వారు స్వయం భావిస్తారు. ఎప్పుడైతే చదువుకొని దేవతలుగా అవుతారో అప్పుడు వినాశనమైపోతుంది. ఇప్పుడు ఇది పాత ప్రపంచము, దీనిని కొత్తగా ఎవరు తయారుచేస్తారు? తండ్రి అంటారు, అది నా పాత్రయే, నేను డ్రామాకు వశమై ఉన్నాను. భక్తి విస్తారము ఎంతగా ఉంది అనేది కూడా పిల్లలకు తెలుసు. ఇది కూడా ఒక ఆట. భక్తికి అర్ధకల్పం పడుతుంది. ఇప్పుడు మళ్ళీ తండ్రి వచ్చారు, మనల్ని చదివించేవారు కూడా వారే. వారే శాంతి స్థాపనను కూడా చేస్తారు. ఎప్పుడైతే ఈ లక్ష్మీ-నారాయణుల రాజ్యం ఉండేదో, అప్పుడు శాంతి ఉండేది. ఇక్కడ అశాంతి ఉంది. తండ్రి ఒక్కరే. ఆత్మలు ఎంతమంది ఉన్నారు. ఇది ఎంత అద్భుతమైన ఆట. బాబా సర్వాత్మలకూ తండ్రి, వారే మనల్ని చదివిస్తున్నారు. మరి ఎంతటి సంతోషము ఉండాలి.

మేమే గోప-గోపికలము మరియు బాబా గోపీ వల్లభుడు అని మీరు భావిస్తారు. కేవలం ఆత్మలను మాత్రమే గోప-గోపికలు అని అనరు. శరీరము ఉంటేనే గోప-గోపికలు అని లేక సోదరీ-సోదరులు అని అనడం జరుగుతుంది. గోపీ వల్లభుడైన శివబాబాకు వీరు పిల్లలు. గోప-గోపికలు అన్న పదమే ఎంతో మధురమైనది. అచ్యుతం, కేశవం, గోపీవల్లభం, జానకీనాథం... అన్న గాయనము కూడా ఉంది. ఈ మహిమ కూడా ఈ సమయానికి చెందినదే. కానీ దాని గురించి తెలియని కారణముగా అన్ని విషయాలను కలగాపులగం చేసేసారు. తండ్రి కూర్చొని ప్రపంచ చరిత్ర-భౌగోళాలను వినిపిస్తారు. వారికైతే కేవలం ఈ ఖండాలను గురించే తెలుసు. సత్యయుగములో ఎవరి రాజ్యం ఉండేది, అది ఎంత సమయం నడిచింది, ఇది వారికి తెలియదు ఎందుకంటే కల్పము ఆయువును లక్షల సంవత్సరాలు అని అనేశారు, పూర్తిగా ఘోర అంధకారములో ఉన్నారు. ఇప్పుడు తండ్రి వచ్చి మీకు సృష్టిచక్ర జ్ఞానాన్ని ఇస్తారు. దానిని తెలుసుకోవడం ద్వారా మీరు త్రికాలదర్శులుగా, త్రినేత్రులుగా అవుతారు. ఇది చదువు. తండ్రి స్వయం అంటున్నారు - నేను కల్పకల్పమూ కల్పపు సంగమయుగములో వచ్చి మిమ్మల్ని పురుషోత్తములుగా తయారుచేస్తాను. నంబరువారుగా మీరే తయారవుతారు. చదువు ద్వారానే పదవి లభిస్తుంది. మనల్ని అనంతమైన తండ్రి చదివిస్తున్నారని మీకు తెలుసు. వారైతే - పరమాత్మ నామరూపాలకు అతీతుడు అని, రాయి రప్పల్లో ఉన్నారని అనేస్తారు. ఏమేమో అంటూ ఉంటారు. దేవతలకు కూడా ఎన్ని భుజాలను చూపిస్తారు. రావణునికి పది తలలను చూపిస్తారు. పిల్లల హృదయంలోకి రావాలి - సర్వాత్మలకూ తండ్రి అయినవారు మమ్మల్ని చదివిస్తున్నారు, వారు పావనులుగా తయారుచేస్తున్నారు, కావున లోలోపల ఎంత సంతోషము ఉండాలి. కానీ ఎప్పుడైతే ఇతరుల కళ్యాణాన్ని కూడా చేసి అందరినీ సంతోషపరుస్తారో, దయార్ద్ర హృదయులుగా అవుతారో, అప్పుడే ఆ సంతోషము కలుగుతుంది. ఓహో, బాబా మమ్మల్ని విశ్వమహారాజులుగా తయారుచేస్తారు. రాజు, రాణి, ప్రజలు అందరూ విశ్వాధిపతులుగా అవుతారు కదా. అక్కడ మంత్రులు ఉండరు. ఇప్పుడు రాజులు లేరు కావున అందరూ మంత్రులే ఉన్నారు. ఇప్పుడైతే

ప్రజలపై ప్రజల రాజ్యం ఉంది. ఘడియ-ఘడియ అనంతమైన తండ్రి మనకు ఏమి చదివిస్తున్నారు అన్నది బుద్ధిలోకి రావాలి. ఎవరైతే బాగా చదువుతారో వారే మొదట వస్తారు మరియు ఉన్నత పదవిని పొందుతారు. ఈ లక్ష్మీ-నారాయణులు ఇంతటి షావుకార్లుగా ఎలా అయ్యారు? వారు ఏమి చేసారు? భక్తి మార్గంలో కొందరు చాలా షావుకార్లుగా ఉంటే వారు అంతటి ఉన్నత కర్మలను చేసారు అని భావించడం జరుగుతుంది. ఈశ్వరార్థము దానపుణ్యాదులు కూడా చేస్తారు, దానికి ప్రతిఫలంగా తమకు ఎంతో లభిస్తుంది అని భావిస్తారు, కావున మరుసటి జన్మలో షావుకార్లుగా అవుతారు. కానీ వారు ఇన్ డైరెక్ట్ గా ఇస్తారు, దాని వల్ల అల్పకాలికంగా ఎంతోకొంత లభిస్తుంది. ఇప్పుడు తండ్రి డైరెక్టుగా వచ్చారు. వచ్చి పావనంగా తయారుచేయండి అని అందరూ వారిని తలచుకుంటూ ఉంటారు కానీ ఈ జ్ఞానాన్ని ఇచ్చి ఈ లక్ష్మీ-నారాయణులు వలె మమ్మల్ని తయారుచేయండి అని అనరు. మనుష్యుల బుద్ధిలోనైతే శ్రీకృష్ణుడే గుర్తుకువస్తారు. తండ్రి గురించి తెలియని కారణముగా ఎంత దుఃఖితులుగా అయిపోయారు. ఇప్పుడు తండ్రి మిమ్మల్ని దైవీ సాంప్రదాయులుగా తయారుచేస్తారు. మీరు శాంతిధామంలోకి వెళ్ళి మళ్ళీ సుఖధామంలోకి వస్తారు. తండ్రి ఎంత బాగా అర్థం చేయిస్తారు. వాళ్ళు వింటున్నా కానీ ఏమీ విననట్లుగానే వింటారు. రాతిబుద్ధి కలవారి నుండి పారసబుద్ధి కలవారిగా అవ్వనే అవ్వరు. రోజంతా బాబా-బాబాయే గుర్తుండాలి. స్త్రీకి తన భర్త వెనుక ప్రాణాలు ఎలా పోతాయి! స్త్రీకి పతిపై ఎంతో ప్రేమ ఉంటుంది. ఇక్కడైతే మీరందరూ పిల్లలే, అయినా కానీ నంబరువారుగా అయితే ఉన్నారు కదా.

ఇటువంటి అనంతమైన తండ్రిని మీరు ఘడియ-ఘడియ మర్చిపోతున్నారు - అని మీకు తెలుసు. తండ్రి అంటారు, నన్ను స్మృతి చేయడం ద్వారా మీ వికర్మలు వినాశనమవుతాయి, అయినా కానీ మర్చిపోతారు. అరే, ఇటువంటి తండ్రి ఎవరైతే మిమ్మల్ని విశ్వాధిపతులుగా తయారుచేస్తున్నారో వారిని మీరు ఎందుకు మర్చిపోతున్నారు? మాయా తుఫానులు వస్తాయి, అయినా కానీ మీరు ప్రయత్నిస్తూ ఉండండి. తండ్రిని స్మృతి చేసినట్లయితే వారసత్వం లభిస్తుంది. స్వర్గవాసులైన దేవతలుగానైతే అందరూ అవుతారు, కానీ శిక్షలు అనుభవించి ఆ తర్వాత అవుతారు. దాని వలన పదవి కూడా చాలా తగ్గిపోతుంది. ఇవన్నీ కొత్త విషయాలు. ఎప్పుడైతే తండ్రిని, టీచరును స్మృతి చేస్తూ ఉంటారో అప్పుడే ఇవి ధ్యాసలోకి వస్తాయి. మీరు టీచరును కూడా మర్చిపోతారు. తండ్రి అంటారు, ఎప్పటివరకైతే నేను ఉంటానో, వినాశన సమయం రాదో మరియు ఎప్పటివరకైతే సర్వస్వమూ ఈ జ్ఞాన యజ్ఞములో స్వాహా అవ్వదో, అప్పటివరకూ ఈ చదువు నడుస్తూనే ఉంటుంది. మీరు అంటారు - అంతా చదివించేసారు కదా, ఇంకా ఏమి చదివిస్తారు? బాబా అంటారు, కొత్త-కొత్త పాయింట్లు వెలువడుతూ ఉంటాయి, మీరు వాటిని విని సంతోషిస్తారు కదా. కావున బాగా చదువుకోండి మరియు సుదాముని వలె ఏదైతే ట్రాన్స్ఫర్ చేయాలో, దానిని కూడా ట్రాన్స్ఫర్ చేస్తూ ఉండండి. ఇది కూడా చాలా పెద్ద వ్యాపారము. బాబా వ్యాపారములో చాలా విశాలహృదయులుగా ఉండేవారు. రూపాయిలో నుండి ఒక అణాను ధర్మార్థము తీసేవారు. నష్టం కూడా వచ్చేది, ఎందుకంటే అందరికన్నా ముందు నేనే వేయవలసి వచ్చేది. మీరు ఎంత ఎక్కువ వేస్తారో, అంతగా మిమ్మల్ని చూసి అందరూ వేస్తారు, అప్పుడు అనేకుల కళ్యాణము జరుగుతుంది అని అందరూ బాబాతో అంటూ ఉండేవారు. అది భక్తి మార్గము, ఇక్కడైతే - బాబా, ఈ సర్వస్వాన్నీ తీసుకోండి అని సర్వస్వాన్ని బాబాకు ఇచ్చేసారు. బాబా అంటారు, నీకు మొత్తం విశ్వము యొక్క రాజ్యాధికారాన్ని ఇస్తాను. వినాశన సాక్షాత్కారము మరియు చతుర్భుజుని సాక్షాత్కారము కూడా జరిగింది. అప్పుడు ఆ సమయంలో - నేను విశ్వాధిపతిగా అవుతాను అని అర్థమయ్యింది. బాబా ప్రవేశించారు కదా. వినాశనాన్ని చూసాను. ఇక అంతే, ఈ ప్రపంచం అంతమవుతోంది, నేను ఈ వ్యాపారము మొదలైనవి ఇంకేమి చేయను, ఇక ఈ గాడిద చాకిరీని వదిలేయాలి, నాకు రాజ్యము లభిస్తోంది అని అనిపించింది. ఇప్పుడు తండ్రి మీకు కూడా అర్థం చేయిస్తున్నారు - ఈ పాత ప్రపంచమంతా వినాశనమవ్వనున్నది. మిమ్మల్ని కుంభకర్ణుని నిద్ర నుండి మేల్కొలిపేందుకు ఎంత పురుషార్థం చేయిస్తున్నారు, అయినా కానీ మీరు మేల్కోరు. పిల్లలు ఒక్క తండ్రినే స్మృతి చేయాలి. సర్వస్వాన్ని తండ్రికి ఇచ్చేసినట్లయితే తప్పకుండా ఒక్క తండ్రియే గుర్తుకువస్తారు. పిల్లలైన మీరు ఎంతగానో స్మృతి చేయవచ్చు, కానీ ఎవరి తల పైనైతే బాధ్యత ఉంటుందో వారు... బంధనాలలో ఉన్నవారి సమాచారాలు ఎన్ని వస్తూ ఉంటాయి. పాపం వారు దెబ్బలు తింటున్నారే, పతులు విసిగిస్తున్నారే అని బాబాకు ఆలోచన నడుస్తుంది. డ్రామాలో ఉంది, మేము ఏమి చేయగలము, కల్పపూర్వము కూడా అబలలపై అత్యాచారాలు జరిగాయి అని అర్థమవుతుంది కానీ ఆలోచన నడుస్తుంది. కొత్త ప్రపంచ స్థాపన జరిగేదే ఉంది. తండ్రి అంటారు, అనేక జన్మల అంతిమ జన్మలోని అంతిమ సమయంలో నేను ప్రవేశిస్తాను. కావున తప్పకుండా మనమే తెల్లగా ఉండేవారము, ఇప్పుడు నల్లగా అయ్యాము. నేనే మొదటి నంబరులోకి వెళ్తాను. నేను వెళ్ళి శ్రీకృష్ణునిగా అవుతాను. ఈ చిత్రాన్ని చూసినప్పుడు - నేను వెళ్ళి ఈ విధంగా అవుతాను అన్న ఆలోచన కలుగుతుంది. కావున బాబా పిల్లలకు బాగా అర్థం చేయిస్తారు. ఇప్పుడు పిల్లల పని ఇది

అర్థం చేసుకొని ఇతరులకు అర్థం చేయించడము. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. మనం గోపీ వల్లభుని గోప-గోపికలము - ఈ సంతోషము మరియు నషాలో ఉండాలి. అంతర్ముఖులుగా అయి విచార సాగర మంథనము చేస్తూ బాబా సమానముగా టీచర్ గా అవ్వాలి.

2. సుదాముని వలె మీ సర్వస్వాన్ని ట్రాన్స్ఫర్ చేయటంతో పాటుగా చదువును కూడా బాగా చదువుకోవాలి. వినాశనానికి ముందే తండ్రి నుండి పూర్తి వారసత్వాన్ని తీసుకోవాలి. కుంభకర్ణుని నిద్రలో నిద్రిస్తూ ఉన్నవారిని మేల్కొలపాలి.

వరదానము:- మధురతా గుణం ద్వారా సంస్కారాల మిలనం చేసుకుంటూ మంగళ మిలనాన్ని జరుపుకునే హోలీహంస భవ

ఏ విధంగా హోలీ నాడు రంగులు వేసుకుంటారో మరియు నోటిని తీపి చేసుకుంటూ మంగళ మిలనాన్ని జరుపుకుంటారో, అలా హోలీహంస పిల్లలైన మీరు ఎప్పుడైతే ఇతరులకు ఆత్మికత అనే సాంగత్యపు రంగును వేసి మధురత అనే మిఠాయిని తినిపిస్తారో, మీ నయనాలు, ముఖము, నడవడిక ద్వారా మధురత అనే గుణం ప్రత్యక్షంగా కనిపిస్తుందో, అప్పుడు మంగళ మిలనము అనగా సంస్కారాల మిలనము జరుగుతుంది. పరస్పరంలో సంస్కారాల మిలనం జరుగడమే ప్రత్యక్షతకు ఆధారము, దీని ద్వారానే జయజయకారాలు జరుగుతాయి.

స్లోగన్:- విదేహీ స్థితిని అభ్యాసం చేయండి - ఈ అభ్యాసమే అకస్మాత్తుగా వచ్చే పేపర్లలో పాస్ చేయిస్తుంది.